క్లుప్తంగా

525 786 సిరీస్‌తో 169 రూ.10 నోట్లు



ఒకే సిరీస్‌తో ఉన్న రూ.10 నోట్లు



మహమ్మద్ ఆలీఖాన్

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ప్రైవేటు స్కూల్ టీచర్ మహమ్మద్ ఆలీఖాన్‌కు ప్రపంచంలోని ఆయా దేశాల కరెన్సీ సేకరించటం హాబీగా పెట్టుకున్నారు. 100 దేశాలకు పైగా కరెన్సీ నోట్లు, 150 దేశాల నాణాలను సేకరించారు. ఆలీఖాన్ వద్ద రూ.20 నుంచి రూ.1,000 నాణెం కూడా ఉండడం విశేషం. 525 786 సీరియల్ నెంబర్‌తో రూ.10 నోట్లు 169 సేకరించారు. ఇలా ఒకే సిరీస్‌లో ప్రతి రూ.10 లక్షల నోట్లకు ఒక నోటు మాత్రమే దొరుకుతుందని ఆలీఖాన్ తెలిపారు. ఇలా సిరీస్ నోట్లను ప్రీఫిక్స్ అంటారని, రిజర్వ్ బ్యాంకు నుంచి అధికారికంగా నోట్లను సేకరించానని చెప్పారు. ఆయా దేశాల కరెన్సీపై స్కూల్, కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటానని తెలిపారు.

సెల్ మాట్లాడవద్దని హెచ్చరించడంతో అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన ఒక యువతిని ఇంట్లో పెద్దలు సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడవద్దని హెచ్చరించటంతో ఆమె కుటుంబ సభ్యులతో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఏలూరులోని ఒక మార్ట్‌లో పనిచేస్తుండగా ఆమెను పని మాన్పించటంతో పాటు సెల్‌ఫోన్ అధికంగా మాట్లాడవద్దని చెప్పటంతో ఇల్లు విడిచిపెట్టి బయటకెళ్లి రాలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఫొటో కాపీయర్ మెషీన్ల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వినియోగానికి కెనాన్ ఎస్‌పీజీ–84 (ఇమేజ్ రన్నర్ 2625) టోనర్ ఫొటో కాపీయర్ మెషీన్ల కొనుగోలుకు సీల్డ్ టెండర్లు కోరుతున్నట్టు జిల్లా జడ్జి సి.పురుషోత్తం కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్డ్ టెండర్ కొటేషన్లు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు చిరునామాకు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందేలా పంపాలని కోరారు.

ఆటలకు చోటేదీ!

- కనుమరుగవుతున్న పాఠశాలల క్రీడా ప్రాంగణాలు
- విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రభావం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. ఏ చిన్న క్రీడా పోటీలు జరిగినా ఆయా పోటీలకు అతిథులుగా వచ్చే అధికారులు లేదా ప్రజా ప్రతినిధులు వేదికపై చెప్పే మాటలివే. అయితే క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన దాఖలాలు కనిపించవు. గత ఆగస్టులో పారిస్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో దాదాపు 100 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒక్క బంగారు పతకం కూడా దక్కలేదు. ఆ క్రీడల్లో భారత్ స్థానం 71కి పరిమితమైంది. విద్యార్థి స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తే భారతదేశానికి ఈ దుస్థితి వచ్చేది కాదని క్రీడాకారులు, క్రీడాభిమానులు విమర్శలు గుప్పించిన విషయం విదితమే.

కానరాని క్రీడా ప్రాంగణాలు

ఏలూరు నియోజకవర్గంలో విద్యార్థుల ఆటలకు చోటు కనపించడంలేదు. గతంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ కొంత క్రీడా ప్రాంగణం ఉండేలా భవనాలను నిర్మించేవారు. క్రీడాప్రాంగణాల్లోనే విద్యార్థులు తమకు తోచిన క్రీడలను ఎంచుకుని ప్రావీణ్యం పెంచుకోవడానికి ప్రయత్నించేవారు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల కంటే ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలను అపార్ట్‌మెంట్లలో నిర్వహిస్తూ కేవలం మార్కులు, ర్యాంకులపైనే దృష్టి సారించి విద్యార్థులను తరగతి గదుల్లోనే మగ్గబెడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణాలు తప్పనిసరిగా ఉండాలి. కానీ దాదాపు 90 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు కనిపించవు. వీటిపై అధికారులు దానిపై దృష్టి సారించడంలేదు. పెరుగుతోన్న విద్యార్థుల సంఖ్యకు తరగతి గదులు పెంచడానికి ప్రస్తుతం ఉన్న పాఠశాలల క్రీడా ప్రాంగణాలనే ఉపయోగించుకుంటున్నారు. దీంతో క్రీడా ప్రాంగణాలు కనుమరుగైపోతున్నాయి. ఏలూరు నగరంలోని దాదాపు అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది. సుబ్బమ్మదేవి ఉన్నత పాఠశాల, గాంధీనగర్ ఉన్నత పాఠశాల, ఏఆర్‌డీజీకే ఉన్నత పాఠశాల, శ్రీ కృష్ణ దేవరాయ ఉన్నత పాఠశాల ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రోత్సాహం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. గతేడాది అక్టోబర్ – నవంబర్ నాటికి దాదాపు అన్ని పాఠశాలలకూ క్రీడా పరికరాలను పంపిణీ చేసింది. వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ బ్యాట్లు, ప్యాడ్లు, బాస్కెట్ బాల్, టెన్నికాయిట్ రింగులు, వివిధ క్రీడలకు సంబంధించిన నెట్‌లు, స్కిప్పింగ్ రోప్‌లు, వేయింగ్ మెషీన్లు, డిస్కస్ రబ్బర్లు, యోగా మ్యాట్లు తదితరాలను పంపిణీ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్నా పాఠశాలలకు క్రీడా పరికరాలు పంపిణీ ఊసే లేదు.



శ్రీకృష్ణ దేవరాయ స్కూల్‌లో అదనపు గదుల నిర్మాణంతో మాయమైన క్రీడా ప్రాంగణం

ప్రోత్సాహం లేకే వెనకబాటు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఏలూరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు చెప్పదగ్గ విజయాలు సాధించలేదు. జిల్లాలోని పలు నియోజకవర్గాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఏలూరు నియోజకవర్గం నుంచి వేళ్లపై లెక్కించదగ్గ మంది మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం ఇక్కడ క్రీడలకు ఏపాటి ప్రోత్సాహం అందుతుందో అర్థమవుతుంది. కొన్ని క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ ప్రాంతం నుంచి విద్యార్థులు ఎంపికైనా వారిలో అత్యధిక శాతం మంది ప్రైవేట్ విద్యా సంస్థల నుంచో లేదా ఎయిడెడ్ విద్యా సంస్థల నుంచో ఉన్నారు తప్ప ప్రభుత్వ యాజమాన్యాల్లోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, నగరపాలక యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులు నామమాత్రంగానే ఉన్నారు.

పోటీ తత్వాన్ని పెంచుతాయి



క్రీడలు పోటీ తత్వాన్ని పెంచుతాయి. క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించే విద్యార్థి చదువులో కూడా అదే పోటీ తత్వంతో విద్యాభ్యాసం చేయగలడు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సంపాదించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలి. క్రీడల్లో ప్రవేశం ఉన్నవారు వయసు మీదపడినా ఆరోగ్యంగా ఉంటారు.

– పత్తిపాటి నాగ విఘ్నేశ్వర రావు, ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్

ప్రాంగణాలను అందుబాటులో ఉంచాలి



విద్యార్థుల ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి. పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉంచాలి. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. విద్యార్థులకు ఆటలాడే సమయం లేకుండా పాఠశాలల సమయం పెంపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ఆటలకు అవకాశం లేకపోతే విద్యార్థి మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.

– కొలికిపోగు లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

24న ఉపాధ్యాయులకు శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులకు మానవత, స్టెప్, అపుస్మా నిర్వహణలో ఈ నెల 24న ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశామని మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కోనేరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 98855 67789, 95333 37799లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఏలూరు(మెట్రో): రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు వారి ఖాతాలకు సొమ్ము జమచేసే విధంగా చర్యలు తీసుకున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాలు, సహకార, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాల ద్వారా గత నెల 22 నుంచి నేటి వరకు రూ.136.44 కోట్ల విలువైన 58,102.800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని, రైస్ మిల్లుకు తరలించినట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సందేహాలుంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08812–230448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453కు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం నగర మేయర్ నూర్జహాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష బిల్వార్చన, అమ్మవారికి ముత్తయిదువులతో సామూహిక లక్ష కుంకుమార్చన చేశారు. రాత్రి స్వామి వారికి ధూపసేవ అనంతరం విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

సిబ్బందికి దుస్తుల పంపిణీ

ఏలూరు (టూటౌన్): విజయవాడ వరదల సమయంలో పారిశుద్ధ్య పనుల్లో సహకరించిన ఏలూరు కార్పొరేషన్‌కు చెందిన 406 మంది సిబ్బందికి మేయర్ షేక్ నూర్జహాన్ గురువారం దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్‌తో కొనుగోలు చేసిన 2 ట్రాక్టర్లను ప్రారంభించారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మిక కుటుంబ సభ్యులు సుమారు 600 మందికి ఈఎస్ఐ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఏలూరు (టూటౌన్): సీపీఎం ఏలూరు జిల్లా 26వ మహాసభలు డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయిగూడెంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు గురువారం స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడారు. 13న బుట్టాయిగూడెంలో భారీ ప్రదర్శన – బహిరంగ సభ, 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, ఇతర నాయకులు పాల్గొంటారని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, పి.కిషోర్‌లు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీ బకాయిలు రైతులకు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్, కోకో తదితర మొక్కలు, దొండ పందిళ్లు, ఇతర ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఎస్ రామ్మోహన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారని, అధిక దిగుబడులు వచ్చే ఆయిల్‌పామ్ విత్తనాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కలు కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరణకు వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాత బస్టాండ్ వద్ద గల సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరణ కోరుతూ ఏలూరు ట్రాఫిక్ సీఐ ఎస్ లక్ష్మణరావుకి ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ తరఫున చక్రాల అమర్ కుమార్, జె.గోపి, అడ్డాల రాజు (నాని) గురువారం వినతి పత్రం అందజేశారు. సిగ్నల్ పాయింట్ జీబ్రా లైన్, స్టాప్ లైన్ మధ్య దూరం దాదాపు 20 మీటర్లు ఉండడంతో వాహనదారులు గమనించకుండా ఇ చలానాలకు బలైపోతున్నారని తెలిపారు. సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న జీబ్రా లైన్, స్టాప్ లైన్, సీసీ కెమెరాలు క్రమబద్ధీకరించాలని కోరారు. నగరంలో దాదాపు 6,000 మంది ఆటో డ్రైవర్లు ఇ–చలానాలు బాధితులుగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ తరహాలో ఇ–చలానాలకు వన్ టైం సెటిల్మెంట్ ద్వారా నామమాత్రపు రుసుముకు ఇ–చలానాలను రద్దు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి సీఐ లక్ష్మణరావు హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు.



ట్రాఫిక్ సీఐకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

విజిలెన్స్ దాడులు

ఉంగుటూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఉంగుటూరులో దాడులు నిర్వహించారు. సత్యం టిఫిన్ సెంటర్‌లో గృహ అవసరాలకు వినియోగించే 6 సిలిండర్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నామని, యజమాని దాసరి పండుపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ అధికారిణి కన్యాకుమారి తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్ల విలువ రూ.14,872 ఉంటుందన్నారు. సీఎస్‌డీటీ కొల్లూరి వెంకట స్వర్ణ దుర్గ, వీఆర్‌ఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విజేతలతో ఎంపీడీఓ పద్మావతీదేవి, సీఐ సత్యనారాయణ తదితరులు

భీమడోలు: పుస్తక పఠనం ద్వారానే విజ్ఞాన సంపత్తి సిద్ధిస్తుందని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి, ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణలు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారో త్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. వివిధ పోటీల్లో విజేతలైన 150 మందికి బహుమతి ప్రదానం చేశారు. చదవడం మాకిష్టం, డిజిటల్ గ్రంథాలయాలు అనే అంశంపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ పద్మావతీదేవి, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, లా అండ్ ఆర్డర్ ఎస్సై వై.సుధాకర్, ఎక్సైజ్ ఎస్సై బి.శివదర, ఎంఈఓ అయినపర్తి భాస్కర్‌కుమార్, సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, విద్యావేత్త జటావల్లభుల సాయిరామ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఒత్తిడి లేని విద్య గ్రంథాలయాల వల్లే సాధ్యమని, మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానమని వివరించారు. తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటుతూ తెలుగు అధ్యాపకుడు జె.సాయిరామ్ పాటిన పద్యాలాపన ఆకట్టుకుంది. అనంతరం పలువురికి దుశ్శాలువా కప్పి మెమెంటోలను అందజేశారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మిలటరీలో సేవలందించిన రాజును సన్మానిస్తున్న షరీఫ్

భవిష్యత్తు అంతా డిజిటల్ విప్లవమే

దెందులూరు: భవిష్యత్తు అంతా డిజిటల్ విప్లవమే అని దెందులూరు మండలం పంచాయతీల విస్తరణ అధికారి షరీఫ్ అన్నారు. గురువారం పోతునూరు గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం గ్రంథాలయ అధికారి జి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మిలటరీలో 24 ఏళ్లు సేవలందించి స్వగ్రామానికి వచ్చిన సైనికుడు నాగురు రాజును గ్రంథాలయంలో పౌర సన్మానం చేశారు. శాలువా, పూల దండలు, బొకేలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	26	కంద	80
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్	60
కాకర కాయలు	30	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	40	అల్లం	70
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	60	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	12
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	28-30	బఠాణి	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

పాఠశాలల పనివేళల పెంపుపై ఆందోళన

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పనివేళలు
- పైలెట్ ప్రాజెక్ట్‌గా నియోజకవర్గంలో 3 పాఠశాలల ఎంపిక
- దూరప్రాంత విద్యార్థుల ఇబ్బందులు
- తిరోగమన విధానాలంటూ ఉపాధ్యాయుల ఆగ్రహం



పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన పెదనిండ్రకొలను జెడ్పీ స్కూల్



తిమ్మయ్యపాలెం నుంచి సైకిల్‌పై కైకరం జెడ్పీస్కూల్‌కు వస్తున్న బాలికలు

నిడమర్రు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని వేళలు గురువారం నుంచి ఒక గంట అదనంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 8 పిరియడ్స్‌లో పాఠశాల కాల నిర్ణయ పట్టిక ఉంది. తాజాగా పాఠశాల కాల నిర్ణయ పట్టిక ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంది. అదన గంటను పాఠశాల అసెంబ్లీ, మెదటి పిరియడ్, స్వల్ప విరామాలు, భోజన విరామాల సమయాలకు కేటాయించారు. పిరియడ్స్ సంఖ్య పాత పద్ధతిలోనే 8గా ఉంది. పని వేళలల్లో అదనంగా పెరిగిన ఒక గంట పని వేళలల వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినుల భద్రత, రవాణా సౌకర్యాలపైనా ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా ఉపాధ్యాయులకు అదనంగా పెరిగిన గంట వల్ల బస్, ఆటో సౌకర్యాల సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యాశాఖలో చేసే ప్రయోగాలు, అసంబంధ నిర్ణయాలతో పాఠశాల విద్య తిరోగమనదిశగా వెళుతుందని మండిపడుతున్నాయి.

పైలెట్ ప్రాజెక్ట్‌గా 28 స్కూల్స్

జిల్లాలో పైలెట్ ప్రజెక్ట్‌గా 28 ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు. వీటిలో ఉంగుటూరు నియోజకవర్గంలోని పెదనిండ్రకొలను, కై కరం, భీమడోలు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉదయం 9 నుంచి 5 గంటల వరకు పాఠశాలల నూతన పని వేళలు మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో తొలివిడతగా హైస్కూల్ ప్లస్‌గా ఉన్న 28 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా స్కూల్స్‌లో మారిన కాల నిర్ణయ పట్టికను గురువారం నుంచి ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. తదనుగుణంగా ఆయా స్కూల్స్‌లోని టీచర్స్ ఉదయం 9 ముందు సాయంత్రం 5 గంటల తర్వాత ఫేసియల్ అటెండెన్స్ వెయాల్సుంది.

ఉపాధ్యాయ సంఘాల నిరసన

పాఠశాలల పని వేళల మార్పుపై ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే టీచర్స్ ఉమ్మడి సంఘం జాక్టో తరుపున జిల్లా అధికారులకు నిరసన తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. గురువారం అమరావతిలో జరిగిన శాసన మండలిలో ఎమ్మెల్యే పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఈ అంశంపై మాట్లాడి ఉన్నత పాఠశాలల పని వేళలు మార్చాలనే ఆలోచన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయా సంఘాల నేతలు చెబుతున్నారు. పనివేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, సాయంత్రం 5 గంటల పైన సరైన రవాణా సౌకర్యం, బాలికలకు భద్రత, మహిళా టీచర్స్ సమస్యలు, విద్యార్థి తరగతి గదిలో ఎంత సమయం శ్రద్ధగా అభ్యసించే అవకాశం ఉంది అన్న అంశాలు ప్రభుత్వం పరిశీలించాలని టీచర్స్ కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేదు



ప్రైవేటు విద్యా సంస్థల్లో పనివేళలు సాయంత్రం 5 గంటల వరకు ఉన్నా, ఇంటికి చేరుకోవడానికి తగిన రవాణా సౌకర్యాలు ఉంటాయి. కానీ దూరంలోని గ్రామాల నుంచి వచ్చే ప్రభుత్వ విద్యార్థులకు ఆ పరిస్థితి లేదు. పెంచిన సమయం బోధనకు కాకుండా విరామాలకు కేటాయించడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఉపయోగం లేదు.

– షేక్ రంగావలి, ఏపీటీఎఫ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి

బాలికల భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి



గణపవరంలోని బాలికల ఉన్నత పాఠశాలకు 7 కిలో మీటర్ల దూరం నుంచి సైకిళ్లపై జల్లికొమ్మర గ్రామం నుంచి విద్యార్థినులు వస్తుంటారు. సీతాకాలంలో 5.30 గంటలకే చీకటి పడుతుంది. చీకట్లో ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది. సాయంత్రం 5 గంటల వరకు పాఠశాల నిర్వహిస్తే, ఇలా 3 నుంచి 8 కిలో మీటర్లు దూరంలోని గ్రామాల నుంచి సైకిళ్లపై వచ్చే ఉన్నత పాఠశాల బాలికల భద్రతను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని తక్షణం ఈ నిర్ణయం విరమించుకోవాలి.

– బొడ్డు రమేష్, యూటీఎఫ్ జిల్లా నాయకులు, గణపవరం